క్లుప్తంగా

1న సామూహిక సత్యనారాయణ వ్రతం

మైలవరం: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ ప్రసాద్, ధార్మిక మండలి సభ్యులు బాలాజీప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మైలవరం నూజివీడు రోడ్డులోని శ్రీకోదండ రామాలయంలో ఆగస్టు ఒకటో తేదీన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ వ్రతాలో అన్ని వర్ణాలు, వర్గాల వారు, దంపతులుగా పూజా సరకులు తెచ్చుకుని ఉచితంగా పాల్గొనవచ్చని తెలిపారు.

సాగునీటిని వినియోగించుకోండి

పెనుగంచిప్రోలు: రైతులు సాగునీటిని వినియోగించుకోవాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు అన్నారు. ఆదివారం స్థానిక మునేరు ప్రధాన కాలువ నుంచి తువ్వ కాలువకు నీటిని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో వ్యవసాయం రైతులకు లాభసాటిగా మారిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, ట్రేడ్ యూనియన్ మండల నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు కొల్లా రఘురామయ్య, ఆలయ డైరెక్టర్ ఆదిమూలం నరసింహారావు, ఇరిగేషన్ జేఈ లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మను ఆదివారం రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని మణికంఠ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ అధికారులు వారికి అమ్మవారి శేషవస్త్రం ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, గుంటూరు జిల్లా అడ్వకేట్ కమిషనర్ జ్ఞానేశ్వరి, రాష్ట్ర కృష్ణ బలిజ జనరల్ సెక్రటరీ పాశం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనచోదకులు నిబంధనలు పాటించాలి

జయంతి(వీరులపాడు): వాహనచోదకులు నిబంధనలు పాటించాలని ఎస్ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. మండలంలోని జయంతి గ్రామంలో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆటోవాలాలు పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల పత్రాలను విధిగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం రికార్డులు సరిగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు టీఎల్ఎన్ ఆచార్యుల అవార్డులు



జగ్గయ్యపేట అర్బన్: ఏటా ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ వరకు పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు టీఎల్ఎన్ ఆచార్యులు పేరుతో అవార్డులు, ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. ఆధ్యాత్మిక గురువు, ధర్మ ప్రచారకులు తట్టా లక్ష్మీ నరసింహాచార్యుల సంస్మరణ సభ ఆదివారం స్థానిక ఉక్కు కళావేదికలో జరిగింది. ఈ సందర్భంగా భగవద్రామానుజ గోష్ఠి కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట ప్రాంతంలో టీఎల్ఎన్ ఆచార్యులు ఆధ్యాత్మింగా చేసిన సేవలను కొనియాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైఎస్సార్ సీపీ నాయకులు పూసల పుల్లారావు, దువ్వల రామకృష్ణ, కాశి కిషోర్, న్యాయవాది సత్యశ్రీనివాస్, అన్నపూర్ణ సేవాసమితి నిర్వాహకులు మహంకాళి జయప్రకాష్, భగవద్రామానుజ గోష్ఠి ప్రతినిధులు ఆకుల స్వాతికుమార్, విజయ దంపతులుపాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని భవానీపురం సీఐ అబ్దుల్ సలాం సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సలాం మాట్లాడుతూ.. రౌడీషీటర్లు తీరు మార్చుకోవాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై నిత్యం తమ నిఘా ఉంటుందన్నారు. దందాలు, పంచాయితీలు మానుకోవాలని సూచించారు. ఇకపై ఏదైనా నేరం చేసినా, చేయించినా భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ప్రతి వారం విధిగా పోలీసు స్టేషన్‌లో హాజరు వేయించుకోవాలన్నారు. అసాంఘిక శక్తులు, కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది జయంతి గ్రామానికి చెందిన భీమవరపు భాగ్యమ్మ. ఆమె వయసు 60. ఆమె గతంలో ఆరోగ్య సమస్యలు వస్తే ప్రైవేట్ డాక్టర్ల వద్ద వైద్యం చేయించుకునేది. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్య వసతులు చెంతనే అందడంతో ఆమెకు ఇంటి వద్దే బీపీ, షుగర్ ఇతర పరీక్షలు చేస్తున్నారు. పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారని ఆమె సంతోషం వ్యక్తం చేసింది.





ఈ ఫొటోలో కనిపిస్తున్న అతని పేరు ఎ.వరప్రసాద్. పెనుగంచిప్రోలు మండలంలోని వెల్లుర్తిపాడు గ్రామం. కిడ్నీ నొప్పులు, జ్వరం అధికంగా ఉండటంతో వైద్యాధికారి ఇందిర ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి 104 రావడంతో సచివాలయం వద్ద క్యాంపు నిర్వహించారు. దానిలో అతనికి వైద్యులు అన్ని పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. గతంలో ఏరోగం ఉన్నా కిలోమీటర్ల మేర ఆసుపత్రికి వెళ్లేవాళ్లం. ఫ్యామిలీ డాక్టర్ గ్రామానికి రావడంతో ఇంటి వద్దకు వచ్చి వైద్యం చేస్తుండటంతో అనేక బాధల నుంచి విముక్తి కలుగుతోంది.

ఊరికి ఆరోగ్యభాగ్యం

- వైద్యరంగంలో మార్పు
- వినూత్నరీతిలో వైద్య సేవలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం
- నందిగామ, జగ్గయ్యపేట నియోజక వర్గంలో ఇంటి వద్దకే వైద్య సేవలు
- రోజుకు 40 నుంచి 80 మందికి వైద్య సేవలు



నందిగామ మండలంలో ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నందిగామ/జగ్గయ్యపేట: ఆరోగ్యమే మహాభాగ్యం. దీన్ని వాస్తవ రూపంలోకి తెస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన పాలనలో వైద్యరంగాన్ని బలోపేతం చేస్తున్నారు. ప్రతి ఊరికి ఆరోగ్యభాగ్యాన్ని కలిగిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటుచేసింది. ఫ్యామిలీ డాక్టర్‌లో భాగంగా విలేజ్ క్లినిక్‌లతో ఇంటి ముంగిటే వైద్య సేవలు అందిజేస్తున్నారు. ప్రతి గ్రామానికి వైద్యుల బృందం పర్యటించి ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన అన్ని రకాల మందులను ఉచితంగా ఏర్పాటు చేస్తోంది. ముఖ్యంగా మంచానికే పరిమితమై వైద్య సేవలు దొరకని వారికి సైతం ఫ్యామిలీ డాక్టర్‌తో వైద్య సేవలందుతున్నాయని 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో రోగులు, వారి బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో 51 విలేజ్ క్లినిక్‌లు

నందిగామ నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉన్నాయి. డివిజన్ హెడ్ క్వార్టర్‌గా ఉన్న నందిగామలో ఏరియా ఆసుపత్రితో పాటు రెండు వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్ లు ఉన్నాయి. ఇవి కాక నాలుగు మండలాల్లో 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు 51 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ఒక్కో విలేజ్ క్లినిక్‌కు రోజుకు 40 మంది వరకు వైద్యసేవలు పొందడానికి వస్తున్నారు. సగటును నెలకు 800 నుంచి 2000 వరకు రోగులు వస్తున్నారు. ప్రస్తుతం వైద్యులే ఇంటి వద్దకు వచ్చి సేవలందిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది.

బయటపడుతున్న దీర్ఘకాలిక వ్యాధులు

గతంలో గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంపై పెద్దగా దృష్టి పెట్టేవారు కాదు. ఈ తరుణంలో తీవ్ర అనారోగ్యం పాలైనప్పుడు ఆసుపత్రులకు వెళితే అప్పుడు దీర్ఘకాలిక వ్యాధులు బయటపడేవి. ప్రస్తుతం ప్రభుత్వంలో అర్బన్ హెల్త్ క్లినిక్‌లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటయ్యాయి. ఇక్కడకు వచ్చిన రోగులకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు చేసి వ్యాధులను నిర్ధారించి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు.

ప్రతి క్లినిక్‌లో ఆధునిక సేవలు

ప్రతి పట్టణ, గ్రామీణ హెల్త్ క్లినిక్‌లలో ప్రభుత్వం ఆధునిక పద్ధతులతో సేవలందిస్తోంది. అవసరమైన వారికి 14 రకాల టెస్టులు క్లినిక్‌ల్లో అందుబాటులో ఉంటాయి.

172 రకాల మందులు కూడా అందుబాటులో ఉంటున్నాయి. ప్రత్యేక వైద్యుల బృందం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ద్వారా ప్రతి గ్రామానికి నెలకు రెండుసార్లు వెళ్లి ప్రత్యేక క్యాంపు పెట్టడంతో పాటు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

జగ్గయ్యపేటలో...

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నెలలో రెండు సార్లు విలేజ్ క్లినిక్‌లను సందర్శిస్తుంటారు. వైఎస్సార్ విలేజ్ సెంటర్(వెల్‌నెస్ సెంటర్)లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రోగులకు 14 రకాల పరీక్షలతో పాటు 107 రకాల మందులను కూడా అందుబాటులో ఉంచి వారికి అందజేస్తారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వత్సవాయి మండలంలోని ఇందుగుపల్లి, జగ్గయ్యపేట మండలంలోని బండిపాలెం గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. నిత్యం 80నుంచి100 మంది రోగులు పరీక్షలు చేయించుకుంటున్నారు.

జగ్గయ్యపేట మండలంలో 104 వాహనాలు 2, 108 వాహనాలు 1 ఉన్నాయి. 15 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వత్సవాయి మండలంలో..104 వాహనం 1, 108 వాహనం 1, 14 మంది సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

104 వాహనం 1, 108 వాహనం 1, 16 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.



బండిపాలెంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో రోగులకు పరీక్షలు

వైద్య సేవలు దగ్గరయ్యాయి



గతంలో అనారోగ్యం వస్తే నందిగామకు వెళ్లాల్సి వచ్చేది. ఇటీవలే మా కాలనీ సమీపంలో అర్బన్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారు. నేను అనారోగ్యంగా ఉందని అక్కడికి వెళితే అన్ని పరీక్షలు చేసి షుగర్ ఉందని నిర్ధారించారు. నెలకు సరిపడా ఉచితంగా మందులు కూడా అందజేశారు.

–గుంటక మేరీ, బీవీఆర్ కాలనీ, నందిగామ

వైద్యులు ఇంటికే వస్తున్నారు

పక్షవాతం రావడం.. ఆర్థిక స్థోమత లేకపోవటంతో కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించలేకపోయా. సీఎం జగన్ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ అనే కార్యక్రమంతో వైద్యులు నెలలో రెండు సార్లు ఇంటికే వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన మందులు ఇచ్చి సలహాలు ఇస్తున్నారు. ప్రభుత్వ వైద్యులు ఇంటికి వచ్చి పరీక్షలు చేయటంతో పక్షవాతం తగ్గుముఖం పడుతోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు.

–రాయప్ప, పక్షవాతం రోగి, గండేపల్లి

నాణ్యమైన వైద్యం అందుతోంది



నాకు గ్యాస్, నొప్పులు, నీరసం ఉంది. పెద్ద వయస్సు కావటంలో ఎక్కడకూ వెళ్లలేని పరిస్థితి. గ్రామానికి 104 వాహనం రావటం, వైద్యులు కూడా గ్రామానికి వస్తుండటంతో చాలా బాధ తప్పింది. ఉచితంగా పరీక్షలు చేయటంతో పాటు మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మాకెంతో లాభంగా ఉంది.

–యలగాల నాగభూషణం, పోచంపల్లి

చెంతనే మంచి వైద్యం



బీపీ, షుగర్‌తో ఇబ్బంది పడేవాడిని. నిత్యం ప్రయివేటు ఆసుపత్రులకు తిరిగే వాడిని. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు గ్రామానికి వచ్చి పరీక్షలు నిర్వహించటంతో పాటు 104 వాహనం ద్వారా ఉచితంగా మందులు ఇస్తున్నారు. బీపీ, షుగర్ కంట్రోల్‌లోకి వచ్చింది. జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

పిల్లెల్లి లక్ష్మయ్య, బలుసుపాడు,

దీర్ఘకాలిక వ్యాధులను గుర్తిస్తున్నాం



ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంది. ముఖ్యంగా ఆసుపత్రికి వచ్చిన వారికి అన్ని పరీక్షలు ఇక్కడే చేసే అవకాశం ఉంది. ఈ పరీక్షలు చేసిన సమయంలో 50 శాతం మందికి పైగా షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులను ముందుగానే గుర్తించగలుగుతున్నాం.

–టి.రవి, వైద్యాధికారి, గొల్లమూడి

నేడు స్పందన

కంచికచర్ల: ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ శంకరబాబు ఆదివారం తెలిపారు. స్పందనలో గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి అర్జీలు దాఖలు చేసుకోవచ్చని అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

పద్మావతి అమ్మవారికి సారె సమర్పణ



జగ్గయ్యపేట అర్బన్: శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలోని దుర్గాపురం శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయం నుంచి ఆదివారం భక్తులు మండలంలోని తిరుమలగిరిలోని శ్రీపద్మావతి అమ్మవారికి సారె సమర్పించారు. ఆదివారం శ్రీగోవింద నామ ప్రచార సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులు తరలివెళ్లారు. అక్కడ శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకొని చీర సారె, పసుపు కుంకుమలు, గాజులు, పండ్లు సమర్పించారు. నియోజకవర్గ గోవింద నామ ప్రచార సేవా సంఘం ధర్మ ప్రచారకులు రామిశెట్టి వెంకటేశ్వరరావు, గుడారు నాగార్జున, చలమల వెంకట ప్రసన్నరావు,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా డ్రెయిన్ నిర్మాణం



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామంలోని సాయినగర్‌కాలనీలో డ్రెయిన్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో సాయినగర్‌లో డ్రెయిన్లు లేకపోవటంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఉదయభాను దృష్టికి తీసుకువచ్చారు. దీంతో రూ. 11 లక్షలతో చేపడుతున్న నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో రూ. 29 లక్షలతో షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో కూడా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. సమస్య పరిష్కరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాహితీమూర్తుల సేవలు సదా స్మరణీయం

విజయవాడకల్చరల్: దివంగత సాహితీమూర్తుల సేవలు సదా స్మరణీయమని అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, శ్రీరమణ సంస్మరణ సభను గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. పెనుగొండ మాట్లాడుతూ.. తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహనీయుల్లో కేతు విశ్వనాథరెడ్డి ఒకరని తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘానికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేవన్నారు. సంగీత సాహిత్య విమర్శకుడు పన్నాల సుబ్రహ్మణ్యం శ్రీ రమణ గురించి మాట్లాడుతూ రాసికన్నా వాసికి ప్రాధాన్యత నిచ్చిన సాహితీ దిగ్గజం శ్రీరమణ అని అభివర్ణించారు. పేరడీ కవిత్వానికి దిశానిర్దేశం చేసిన శ్రీరమణ తన కథల ద్వారా అద్భుతాలనే సృష్టించారన్నారు. ఆయన ప్రతిభకు మచ్చుతునక మిథునం కథ చాలన్నారు. సభను సమన్వయ పర్చిన గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. మనుషులు కనుమరుగైనా వారి సాహిత్యం సజీవంగానే ఉంటుందన్నారు. సంస్మరణ సభలో బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం



29వ వార్డులో డ్రెయిన్ పనుల ప్రారంభంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఆదివారం స్థానిక 29, 11వ వార్డుల్లో చేపట్టిన రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ 29వ వార్డులో డ్రెయిన్ లేక 20 ఏళ్లుగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలియడంతో నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 11వ వార్డులో బైపాస్ రోడ్డుకు కలుపుతూ మినీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆధ్వర్యాన పట్టణంలో మరింతగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ జగ్గయ్యపేటను అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి కృషి చేస్తామని తెలిపారు. పద్మావతినగర్‌లో జరుగుతున్న పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్ నకిరికంటి వెంకట్, పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బద్దూనాయక్ పాల్గొన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఆలయం వద్ద భక్తుల సందడి



క్యూలైన్‌లో భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉండాలి



కంచికచర్లలో అనారోగ్యంతో బాధపడుతున్న ముత్తయ్యకు ఆర్థిక సాయం చేస్తున్న భూషణం

కంచికచర్ల: ప్రజారోగ్యం బాగుండాలని పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బెజ్జం భూషణం అన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులుగా చేస్తున్న వంగల సాంబశివరావు, శేషం ముత్తయ్యలకు సర్పంచి వేల్పుల సునీత, పారిశుద్ధ్య కార్మికుల సహకారంతో ఆదివారం రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, వంగల సాంబశివరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై ఇంటివద్దనే ఉంటున్నాడు. అనారోగ్యంతో బాధపడుతూ ముత్తయ్య విధుల్లోకి రాకపోవటంతో గమనించిన సర్పంచి, తోటి పారిశుద్ధ్య కార్మికులు.. ఒక్కొక్కరికి రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేసామన్నారు. పలువురు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన కనకదుర్గ నృత్య మందిర్‌కు చెందిన కళాకారులు ఆదివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికై న క్రీడాకారులను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అభినందించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులు వరుణ్ సాత్విక్(వైస్ కెప్టెన్), భాను వరప్రసాద్(బ్యాట్స్ మెన్), చిన్న(స్పిన్ బౌలర్) ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైన సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వారిని ప్రత్యేక అభినందించారు. ఈ నెల 24 నుంచి ఆగస్టు 3 వరకు జరిగే టోర్నమెంట్‌లో వీరు ప్రతిభ కనపరచి జగ్గయ్యపేటకు, ఏపీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైఎస్సార్ సీపీ నాయకులు దువ్వల రామకృష్ణ, కాశి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

30న 'కథ చెబుతారా .. ఊ కొడతాం' పోటీలు

విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం కథ చెబుతారా.. ఊ కొడతాం ధార్మిక కథల పోటీ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ధర్మపరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ తెలిపారు. సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో ఆదివారం అధ్యాపకులు, న్యాయనిర్ణేతల అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చుట్టుగుంటలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా లయన్స్ క్లబ్ కార్యాలయంలో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉచితంగా పాల్గొనాలని కోరారు. కథలు, భారతీయ ఇతిహాసాలు, పురాణాలు, భారతీయ సంస్కృతి సంప్రదాయలకు సంబంధించి కథలు ఉండాలని సూచించారు. విజేతలకు కేటగిరిల వారీగా బహుమతులను అందజేస్తామన్నారు. జిల్లా ధార్మిక పరిషత్ సభ్యులు రమణారావు, బాల కోటేశ్వరరావు మాట్లాడుతూ బాల బాలికలలోని ప్రతిభను గుర్తించి వారికి హిందూ సంస్కృతి పట్ల అవగాహన కలిగించడానికి కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో మంగిపూడి వెంకటశాస్త్రి, ఉప్పులూరు శేషప్రసాద్, విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ పాల్గొని, బ్యానర్‌ను ఆవిష్కరించారు. వివరాలకు 70322 55499 సంప్రదించాలని కోరారు.

అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలని సరస్వతీ సామాజ్య అధ్యక్షుడు అయ్యంకి మురళీకృష్ణ తెలిపారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం అంతరిక్ష వారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ విద్యార్థులకు అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన కల్పించారు. అంతరిక్ష రంగంలో భారతదేశ విజయాలు, ప్రయోగాలు, స్పేస్ షిప్ తదితర అంశాలను వివరించారు. ఇటీవల భారత్ ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతం కావడం గర్వించదగ్గ విషయమన్నారు. చంద్రయాన్-3 భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన చంద్ర యాత్ర అన్నారు. భారత చంద్రయాన్ కార్యక్రమంలో ఇది మూడోవదని, చంద్రయాన్-2 లో మాదిరిగా ఇందులో కూడా రోవర్, ఒక ల్యాండర్ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.